సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు ధర పలికాయి. మార్కెట్‌కు 23 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



ఆనందంలో ఆర్టీసీ ఉద్యోగి

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం తర్వాత కార్మికులకు మంచి రోజులు వచ్చాయి. ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు, అలవెన్సులు అందుతున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
36.1°/13.4°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

భారీ వాహనాలపై మాత్రమే ఆంక్షలు

అనంతపురం: సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో భారీ వాహనాలకు మాత్రమే ఆంక్షలు విధిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాసింజర్, కార్లు, అత్యవసర వాహనాలు తదితర అన్ని రకాల వాహనాలకు ఎలాంటి ఆంక్షలు ఉండవన్నారు. యథావిధిగా అనంతపురం మీదుగా హైవే-44 పై వెళ్లవచ్చని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు మాత్రమే మళ్లింపు ఆంక్షలు ఉంటాయన్నారు.

- బెంగళూరు నుంచి అనంతపురం మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన భారీ గూడ్స్ వాహనాలను మామిళ్లపల్లి వద్ద మళ్లిస్తారు. మామిళ్లపల్లి నుంచి కనగానపల్లి, నూతిమడుగు, కళ్యాణదుర్గం, అనంతపురం మీదుగా జాతీయ రహదారి-44 గుండా వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి అనంతపురం మీదుగా బెంగళూరు వైపు వెళ్లాల్సిన భారీ గూడ్స్ వాహనాలను అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి జాతీయ రహదారి-44 వద్ద మళ్లిస్తారు. సోములదొడ్డి, తడకలేరు, గుత్తిరోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, బుక్కరాయసముద్రం, నార్పల, బత్తలపల్లి, ధర్మవరం, మామిళ్లపల్లి మీదుగా వెళ్లాలి.
- చెన్నై, కదిరి వైపు నుంచి పంగల్ రోడ్డు మీదుగా జాతీయ రహదారి-44పై హైదరాబాద్ వెళ్లాల్సిన భారీ గూడ్స్ వాహనాలు బత్తలపల్లి వద్ద మళ్లిస్తారు. బత్తలపల్లి నుంచి నార్పల, బుక్కరాయసముద్రం, ఎన్టీఆర్ మార్గ్, గుత్తిరోడ్డు, తడకలేరు, సోములదొడ్డి వద్ద జాతీయ రహదారి-44 మీదుగా వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి అనంతపురం మీదుగా కదిరి, చెన్నై వైపు వెళ్లాల్సిన భారీ గూడ్స్ వాహనాలు సోములదొడ్డి వద్ద మళ్లిస్తారు. సోములదొడ్డి నుంచి తడకలేరు, గుత్తిరోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, బుక్కరాయసముద్రం, నార్పల, బత్తలపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- ప్రజలు, వాహనచోదకులు అసౌకర్యానికి గురికాకుండా మళ్లింపు ఆంక్షలు భారీ గూడ్స్ వాహనాలకు మాత్రమే పరిమితం చేశామని, పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ విజ్ఞప్తి చేశారు.

నేడు సిద్ధం

దారులన్నీ రాప్తాడు వైపే!



రాప్తాడు ఆటోనగర్ వద్ద సర్వాంగసుందరంగా ముస్తాబైన 'సిద్ధం' సభా ప్రాంగణం

- నేడు జిల్లాకు సీఎం వైఎస్ జగన్
- 'సిద్ధం' సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- రాప్తాడు ఆటోనగర్ వద్ద ఏర్పాట్లు పూర్తి
- సీమ నలుమూలల నుంచి భారీగా తరలిరానున్న జనం
- సమరోత్సాహంతో వైఎస్సార్ సీపీ కేడర్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాప్తాడు ఆటోనగర్ వద్ద ఆదివారం జరగనున్న 'సిద్ధం' సభకు సర్వం సిద్ధం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభా వేదికపై నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఎన్నికలపై కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీఎం ప్రసంగంపైనే అందరి దృష్టి

'చెప్పింది చేశాం, చెప్పనివీ చేశాం, మీకు మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండి' అంటూ చరిత్రలో తొలిసారి చెప్పింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే. ఇప్పటికే రాష్ట్రంలో 95 శాతం మందికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధి కలిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాది మందికి సంక్షేమ ఫలాలు దక్కాయి. ఈ క్రమంలోనే రాప్తాడులో వైఎస్సార్ సీపీ 'సిద్ధం' నిర్వహిస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే విశాఖ జిల్లా భీమిలి, పశ్చిమగోదావరి జిల్లా దెందులూరులో నిర్వహించిన 'సిద్ధం' సభలకు జనం పోటెత్తారు. సంక్షేమ సారథికి జై కొట్టారు. ఆ రెండు సభల కంటే మించిన జనం 'రాప్తాడు'కు రానున్నట్లు అంచనా వేస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించి కూడా సీఎం వైఎస్ జగన్ కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని ఇప్పటికే మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్న నేపథ్యంలో జనంతో పాటు ప్రతిపక్ష నేతలు కూడా ఆదివారం రాప్తాడు ఆటోనగర్ వద్ద జరిగే సభ వైపే దృష్టి సారించారు.

కేడర్‌కు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు..

'సిద్ధం' సభకు రాయలసీమ జిల్లాలు (ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, చిత్తూరు) నుంచి లక్షలాది మంది తరలి రానున్నారు.ఈ నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా 110 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో సభా వేదికతో పాటు పదుల సంఖ్యలో గ్యాలరీలు నిర్మించారు. ప్రసంగం అనంతరం సీఎం జగన్ 'వాక్ వే' ద్వారా పార్టీ కేడర్ దగ్గరకు వెళ్లి ప్రత్యేకంగా పలకరించడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ముఖ్య నేతలతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు పూర్తిస్థాయిలో హాజరుకానున్న నేపథ్యంలో ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు 10 రోజులుగా ఏర్పాట్లను నిత్యం పర్యవేక్షించారు. 'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్ల మంత్రి పెద్దిరెడ్డి, తలశిలతో పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల, అనంతపురం జిల్లా పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు పరిశీలించారు. సిద్ధం సభ మ్యాప్ విడుదల చేశారు.

ఆకర్షణీయంగా ఫ్లెక్సీలు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు కూడా 'సిద్ధ' మయ్యారు. సభ వద్ద భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులను ఫ్లెక్సీలతో ముంచెత్తారు. చాలా చోట్ల భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు.వేదికకు నాలుగు వైపులా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు, మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

భారీ బందోబస్తు

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పుట్టపర్తి విమానాశ్రయంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సీఎం జగన్ ఆదివారం ఉదయం గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో సత్యసాయి విమానాశ్రయం చేరుకోనుండగా భద్రతను కట్టుదిట్టం చేశారు. శనివారం ఎస్పీ స్వయంగా వెళ్లి విమానాశ్రయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రాంతంలో బారికేడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఇతర భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలకు బందోబస్తుపై సీఎం సెక్యూరిటీ అధికారి రాజు, ఎస్పీ మాధవరెడ్డి దిశానిర్దేశం చేశారు. విమానాశ్రయంలో ముగ్గురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 19 మంది ఎస్‌ఐలు, 93 మంది కానిస్టేబుళ్లు, 9 మంది మహిళా కానిస్టేబుళ్లతో పాటు ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బందితో భద్రత కట్టుదిట్టం చేస్తున్నట్లు తెలిపారు.

సీఎం పర్యటన సాగేదిలా..

అనంతపురం ఎడ్యుకేషన్: సీఎం వైఎస్ జగన్ పర్యటన షెడ్యూల్‌ను శనివారం ఉన్నతాధికారులు విడుదల చేశారు. ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 2.55 గంటలకు బయలుదేరి 3.15 గంటలకు రాప్తాడు వస్తారు. 3.20 గంటలకు హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 3.30 నుంచి 5 గంటల వరకూ బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగిస్తారు. అనంతరం 5.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 5.35 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. 5.45 గంటలకు విమానంలో గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారు. 6.30 గంటలకు అక్కడికి చేరుకుని 6.55 గంటలకు తన నివాసానికి చేరుకుంటారు.



సిద్ధం సభ మ్యాప్‌ను ప్రదర్శిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి



పుట్టపర్తి విమానాశ్రయంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి



పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీస్తున్న జేసీ

లేపాక్షి: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని లేపాక్షి, కంచిసముద్రం, బయన్నపల్లి, మద్దిపి, గోపిందేవరపల్లి, శిరివరం, గౌరిగానపల్లి, మానేపల్లి, చోళసముద్రం, బిసలమానేపల్లి, మల్లిరెడ్డిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. లేపాక్షి, మానేపల్లి పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ర్యాంపు ఏర్పాటు చేయాలని, బయన్నపల్లిలో మరుగుదొడ్లను మెరుగుపర్చాలని, నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా శిరివరం పాఠశాలలో డిజిటల్ తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. బైజూస్ కంటెంట్ ఉపయోగాలపై విద్యార్థులను ఆరా తీశారు. జేసీ వెంట పలువురు అధికారులు ఉన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

- ఓటరు జాబితా సవరణ క్లెయిమ్‌లపై సమగ్ర విచారణ జరపాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



పుట్టపర్తి అర్బన్: 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకంలో స్థలాలు మంజూరైన వారికి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించాలని, ఈ ప్రక్రియ అన్ని సచివాలయాల్లోనూ జరగాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ భరత్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల కమిషనర్లు, ప్రత్యేకాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ 75 శాతం పట్టాల రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. ధర్మవరం డివిజన్‌లో పురోగతి కనిపించడం లేదని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ పూర్తి కావాలి

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ జిల్లాలో మందకొడిగా సాగుతోందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా కేవలం 16 శాతం కార్డులు మాత్రమే పంపిణీ చేశారన్నారు. ఈనెల 19వ తేదీ నాటికి వందశాతం కార్డులు లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో కదిరి రూరల్, అర్బన్, హిందూపురం రూరల్, అర్బన్, ముదిగుబ్బ, గాండ్లపెంట, లేపాక్షి, మడకశిర, ఎన్‌పీ కుంట, ఓడీచెరువు, కనగానపల్లి, రొద్దం, కొత్తచెరువు, పరిగి, మండలాలు చాలా వెనుకబడి ఉన్నాయని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు.

పరిశీలించాకే తొలగించాలి

ఓటరు జాబితా సవరణలు, మార్పులు చేర్పులపై వచ్చిన క్లెయిమ్‌లను సమగ్రంగా విచారించి పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. క్లెయిమ్ తొలగించాలంటే కచ్చితంగా ఎన్నికల అధికారులను సంప్రదించాలన్నారు. నూతన ఓటరుగా నమోదు చేసుకున్న యువత ఆధార్, బర్త్ సర్టిఫికెట్, స్కూల్ సర్టిఫికెట్‌లు ఈఆర్‌ఓ పరిశీలించాలన్నారు. డబుల్ ఎంట్రీలు, డూప్లికేట్, మరణించిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించి తొలగించాలన్నారు.

క్లుప్తంగా

ఆస్తుల పత్రాలు.. అక్రమ లావాదేవీలు

- 'పురం' ఫైనాన్షియర్ అశ్విన్ కార్యాలయంలో భారీగా లభ్యం
- శనివారం మధ్యాహ్నం వరకూ కొనసాగిన ఐటీ సోదాలు

హిందూపురం అర్బన్: పలువురు ప్రముఖులకు సంబంధించిన ఆస్తుల పత్రాలు..చిట్స్‌కు సంబంధించిన పుస్తకాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన హామీ పత్రాలు భారీగా బయట పడుతున్నాయి. పట్టణంలోని ప్రముఖ ఫైనాన్షియర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి అశ్విన్ ఫైనాన్స్ కార్యాలయం శ్రీసద్గురు ఎంటర్ ప్రైజెస్‌లో ఆదాయపన్ను శాఖ అధికారులు శనివారం మధ్యాహ్నం వరకూ సోదాలు కొనసాగించారు. శుక్రవారం మధ్యాహ్నం అశ్విన్ ఇల్లు, కార్యాలయంలో ఏకకాలంలో దాడులు చేసిన ఆదాయ పన్ను శాఖ అధికారులు శనివారమూ సోదాలు కొనసాగించారు. తనిఖీల్లో పెద్ద ఎత్తున అక్రమ లావాదేవీలు, చిట్ నిర్వహణ, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. అయితే వివరాలు చెప్పేందుకు మాత్రం అధికారులు నిరాకరించారు. పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని మాత్రం తెలిపారు.

క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతం

పుట్టపర్తి అర్బన్: ఓటరు జాబితా సవరణలో ప్రక్రియలో భాగంగా అందిన క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతమైంది. జనవరి 22వ తేదీన ఓటరు తుది జాబితాను విడుదల చేయగా, ఆరోజు నాటికి అందిన క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియ సాగుతోంది. జిల్లాలోని 1,561 మంది బీఎల్‌ఓలు నాలుగు రోజుల నుంచి కలెక్టరేట్‌లో డివిజన్ల వారీగా క్లెయిమ్‌ల పరిశీలన చేపట్టారు. తమ పరిధిలోని క్లెయిమ్‌లను పరిశీలించి అధికారుల ఆదేశాలతో పరిష్కరిస్తున్నారు. ఇలా నెలరోజుల్లోనే 40 వేల క్లెయిమ్‌లు పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా నూతన ఓటరు నమోదు, మరణాలు, డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లి కుటుంబాలు, ఒకే కుటుంబంలో 10కి పైగా ఓటర్లు ఉన్న వాటిని పరిశీలించిన అనంతరం ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తారు.

అప్రమత్తంగా ఉండాలి

తాడిమర్రి: రాప్తాడు వద్ద ఆదివారం జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభకు వెళ్లే వాహనాల రాకపోకలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి ఎస్‌ఐ నాగస్వామిని ఆదేశించారు. వైఎస్సార్ జిల్లా నుంచి సిద్ధం సభకు వెళ్లే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎంపీ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో తాడిమర్రి సమీపంలో ఏర్పాటు చేయనున్న భోజన వసతి ప్రాంతాన్ని శనివారం ఆయన డీఎస్పీ శ్రీనివాసులుతో కలసి పరిశీలించారు.

ఆనందంలో ఆర్టీసీ ఉద్యోగి

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమై నాలుగేళ్లు పూర్తి
- ఉద్యోగులకు పెరిగిన ఆర్థిక భద్రత, భరోసా
- జిల్లా వ్యాప్తంగా 1,686 కుటుంబాల్లో వెలుగులు

డిపో పేరు	కండెక్టర్	డ్రైవర్లు	ఇతరులు	మొత్తం
ధర్మవరం	108	105	67	280
హిందూపురం	119	144	89	352
కదిరి	183	199	89	471
మడకశిర	53	71	51	175
పెనుకొండ	35	50	47	132
పుట్టపర్తి	71	107	67	245
డీపీటీఓ	2	4	24	31
	571	680	201	1,686



పుట్టపర్తి టౌన్: రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) గతంలో ప్రభుత్వరంగ సంస్థే అయినా ఉద్యోగులు అవస్థలు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానం అన్న మాట ఏప్రభుత్వమూ గుర్తించలేదు. సంస్థ నష్టాల్లో ఉన్నా.. ఏమైన ఒడుదొడుకులు ఎదురైనా ఉద్యోగులకు జీతాలు అందేవి కాదు. సమస్యల కోసం యూనియన్ లీడర్లు కార్మికులతో ధర్నా చేస్తే గతంలో జీతాల్లో కోతలు విధించేవారు. అయితే వారి కష్టనష్టాలు చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తేఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేస్తామని పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చారు. మాటకు కట్టుబడి 2020 జనవరి ఒకటో తేదీన ప్రభుత్వంలోకి విలీనం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొన్న ఈ సాహసోపేత నిర్ణయం కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయి. ఆర్టీసీ ఉద్యోగలంతా రవాణా శాఖ ఉద్యోగులుగా మారారు. వారి కష్టాలు తీరాయి. నాలుగేళ్లుగా వారికి ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా జీతాలు, బెనిఫిట్స్, అలవెన్స్‌లు, అందుతున్నాయి. ఈ నిర్ణయంతో శ్రీసత్యసాయి జిల్లాలో 1,686 కుటుంబాల్లో సంతోషాలు నిండాయి.

తంచన్‌గా జీతాలు

ప్రభుత్వంలోకి విలీనం అయ్యాక ఆర్టీసీ ఉద్యోగులకు ఒకటో తేదీనే తంచన్‌గా జీతాలు అందుతున్నాయి. కరోనా లాక్‌డౌన్ కారణంగా రెండేళ్లలో నాలుగునెలలు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. గతంలో ఈ పరిస్థితి వస్తే కార్మికుల జీతాల్లో కోతలు పడేవి. విలీనం తరువాత సంస్థ ఆదాయం, నష్టాలు పట్టించుకోకుండా ఎలాంటి సమయంలోనైనా ఒకటో తేదీనే తంచన్‌గా జీతాలు అందజేస్తున్నారు. విలీనం సాహసోపేత నిర్ణయమని మేము జగనన్నకు అండగా ఉంటామని కార్మికులు పేర్కొంటున్నారు.

ఉద్యోగ భద్రత వచ్చింది



రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులుగా ఉన్నప్పుడు మాకు ఉద్యోగ భద్రత ఉండేది కాదు. ఏదైనా పొరపాటు జరిగినా ఆర్టీసీ సంఘాలు చేపట్టే ఆందోళనలో పాల్గొన్నా ఒత్తిళ్ల బెదిరింపులు ఉండేవి. విలీనం తరువాత అలాంటి సమస్యలు లేవు. జీతభత్యాలకు భరోసా వచ్చింది. ఉద్యోగ భద్రత కల్పించారు. చాలా సంతోషంగా ఉన్నాం. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

– చెన్నప్ప కండక్టర్, పుట్టపర్తి డిపో

నాడు జీతాల కోసం ఎదురుచూపు



ఆర్టీసీ ఉద్యోగులుగా ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు పడేవాళ్లం. చాలీచాలని వేతనాలు, అలవెన్సులు, జీతాల పెంపుకోసం సంఘాలు చాలాసార్లు ఆందోళనలు చేసినపుడు మా జీతాల్లో కోత పడేవి. కానీ జాతాలు పెరిగేవి కావు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీని ప్రజారవాణా శాఖలోకి విలీనం చేయడం వల్ల ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా జీతాలు, అలవెన్సులు అందుతున్నాయి.

– హనుమంతునాయక్, డ్రైవర్, పుట్టపర్తి డిపో

శాశ్వత పరిష్కారం



ఆర్టీసీ కార్మికుల సమస్యలకు సీఎం జగన్ శాశ్వత పరిష్కారం చూపారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే కమిటీ వేసి ఆరు నెలల్లోనే ప్రభుత్వంలోకి ఆర్టీసీని విలీనం చేశారు. గతంలో కార్మికులను పట్టించుకొన్న ముఖ్యమంత్రులు ఎవరూలేరు. కరోనా పరిస్థితుల్లోనూ జీతాలకు బ్రేక్ పడకుండా చూశారు. కార్మికుల జీవితాల్లో వెలుగునింపిన ముఖ్యమంత్రిని కలకాలం గుర్తు పెట్టుకొంటాం.

– బాబన్న, ఏడీసీ, పుట్టపర్తి డిపో

ట్రాఫిక్ మళ్లింపుపై పోలీసులకు దిశానిర్దేశం

బత్తలపల్లి: రాప్తాడు వద్ద 'సిద్ధం' బహిరంగ సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నందున భారీ వాహనాల రాకపోకల మళ్లింపుపై పోలీసు సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి దిశానిర్దేశం చేశారు. శనివారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలికి చేరుకున్న ఎస్పీ.. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం, ధర్మవరం రూరల్, ముదిగుబ్బ సీఐలు సుబ్రమణ్యం, ఆరోహణరావు, యతీంద్రతో ట్రాఫిక్ మళ్లింపుపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భారీ వాహనాలు హైదరాబాద్ నుంచి బెంగళూరు, కదిరి మీదుగా చెన్నై వెళ్లే వాహనాలు అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి వద్ద మళ్లించి తడకలేరు, గుత్తి రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, నార్పల, బత్తలపల్లి, ధర్మవరం, మామిళ్లపల్లి మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా చెన్నై, కదిరి వైపు నుంచి వయా పంగల్ రోడ్డు మీదుగా జాతీయ రహదారి–44పై హైదరాబాద్ వెళ్లాల్సిన భారీ వాహనాలు బత్తలపల్లి వద్ద మళ్లించారు. బత్తలపల్లి నుంచి నార్పల, బుక్కరాయసముద్రం, ఎన్టీఆర్ మార్గ్, గుత్తిరోడ్డు, తడకలేరు, సోములదొడ్డి వద్ద జాతీయ రహదారి–44 మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.



బత్తలపల్లి కూడలిలో ట్రాఫిక్ మళ్లింపుపై దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

దొంగ ఓట్ల నమోదుకు టీడీపీ కుట్ర

- జైలులో ఉన్న వ్యక్తి పేరిట ఫారం–7 దాఖలు
- ఆధారాలతో ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్మవరం అర్బన్: టీడీపీ నాయకులు దొంగ ఓట్ల నమోదుకు కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. సబ్‌జైలులో ఉన్న వ్యక్తి ఓటు కోసం నమోదు చేసుకున్నట్లుగా ఆన్‌లైన్‌లో ఎక్కించారని ఆధారాలతో సహా శనివారం ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి గొట్లూరు వైఎస్సార్‌సీపీ నాయకులు సంగాలప్ప, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు ఫిర్యాదు చేశారు. గొట్లూరు 145 పోలింగ్ బూత్‌లో ఓటర్ నంబరు 314 తలారి నారాయణస్వామి అనే వ్యక్తి ఫారం–7 దరఖాస్తు చేసినట్లు ఉందన్నారు. గ్రామానికి చెందిన సాకే శ్రీరాములు అనుమానాస్పద మృతి కేసులో తలారి నారాయణస్వామి గత 45 రోజుల నుంచి సబ్‌జైలులో ఉన్నాడని వివరించారు. జైలులో ఉన్న వ్యక్తి పేరును ఓటరు జాబితాలో చేర్చేందుకు టీడీపీ వారే దరఖాస్తు చేశారని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. గ్రామంలోని 144, 146, 147 పోలింగ్ బూత్‌లలో కూడా ఫారం–7 కింద దరఖాస్తు చేసిన దొంగ ఓట్లు చాలా ఉన్నాయని ఆర్డీఓకు వివరించారు. వాటిపై విచారణ జరిపి ఫారం–7 సమర్పించడంలో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఆర్డీఓ స్పందిస్తూ విచారణ చేపడుతామని హామీ ఇచ్చారు.



దొంగ ఓట్లపై ఆర్డీఓకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పథకం ప్రకారమే హత్య

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

కదిరి అర్బన్: తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని పథకం ప్రకారమే భర్తను ప్రియుడు, మరొకరి సహకారంతో భార్య హత్య చేయించింది. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్‌తో కలిసి డీఎస్పీ శ్రీలత మీడియాకు వెల్లడించారు. సున్నపుగుట్ట తండాకు చెందిన గులాబ్‌జాన్, ఖాదర్‌బాషా దంపతులు. ఖాదర్ బాషా వృత్తిరీత్యా డ్రైవర్. గులాబ్‌జాన్ కొన్నేళ్లుగా నిజాంవలి కాలనీకి చెందిన బాబ్జాన్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. భర్తకు విషయం తెలిసి పద్ధతి మార్చుకోవాలని భార్యను మందలించాడు. బాబ్జాన్‌ను వదులుకోలేని గులాబ్‌జాన్.. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. జనవరి 31న ఖాదర్‌బాషా విధులు ముగించుకుని ఇంటికి వచ్చి పడుకున్నాడు. అప్పటికే కొత్తబైపాస్ రోడ్డులో వేచి ఉన్న ప్రియుడు బాబ్జాన్, మరో వ్యక్తి షామీర్‌లను గులాబ్‌జాన్ ఇంటికి పిలిపించుకుంది. గాఢనిద్రదలో ఉన్న ఖాదర్‌భాషా ముఖంపై బాబ్జాన్ దిండు వేసి ఊపిరి ఆడకుండా నొక్కిపట్టాడు. భార్య.. కాళ్లు గట్టిగా అదిమి పట్టుకుంది. షామీర్ అక్కడే అందుబాటులో ఉన్న కత్తితో ఖాదర్‌బాషా గొంతు కోశాడు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక మృతదేహాన్ని స్కూటీలో తీసుకెళ్లి గ్రామ పరిసరాల్లో పడేశారు. అనంతరం పెట్రోల్ వేసి నిప్పటించారు. శరీరం పూర్తిగా కాలకపోవడంతో సగం కాలిన మృతదేహాన్ని గోనేసంచిలో వేసి అందులో రాళ్లు వేసి కారెడ్డిపల్లి ఒడ్డు చెరువులో పడేశారు. తన భర్త కనిపించడం లేదని ఈ నెల ఐదో తేదీన గులాబ్‌జాన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులకు... ఫిర్యాదుదారుపై అనుమానం రావడంతో తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో ఆమె తన భర్తను ప్రియుడు, మరొకరితో కలిసి హత్య చేసినట్లు అంగీకరించింది. ఈ కేసులో ఏ1 నిందితురాలు గులాబ్‌జాన్, ఏ2–బాబ్‌జాన్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఏ3 – షామీర్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. హత్యకేసును త్వరగా ఛేదించిన సీఐ మోహన్, సిబ్బంది సాల్మన్‌రాజ్, షాహీనా, బద్రుద్దీన్‌లను డీఎస్పీ అభినందించారు.




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీలత

ప్రకృతి వ్యవసాయం అద్భుతం

- రైతులకు ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహం అభినందనీయం
- కితాబు ఇచ్చిన కర్ణాటక ఉద్యానశాఖ బృందం సభ్యులు

మడకశిర రూరల్: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయంగా అద్భుతంగా సాగుతోందని కర్ణాటక రాష్ట్ర ఉద్యానశాఖ అధికారుల బృందం ప్రశంసించింది. రైతుల ఉత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం చాలా బాగుందని మెచ్చుకుంది. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు పెట్టుబడి తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. శనివారం కర్ణాటక ఉద్యానశాఖ సెక్రటరీ శ్యామల ఇక్బాల్ (ఐఏఎస్), డైరెక్టర్ రమేష్ బృందం మండల పరిధిలోని ఆమిదాలగొంది కృతి వ్యవసాయ యూనిట్ పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ప్రకృతి వ్యవసాయంతో రామాంజనేయరెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవిందరెడ్డి సాగు చేసిన మునగ, నిమ్మ, టమాట, కూరగాయాలు, మిరప తదితర పంటలను పరిశీలించారు. సాగు విధానం, అనుభవాలు, ఖర్చు, దిగుబడి తదితర వాటిపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమిదాలగొంది గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై సంఘాల నిర్వహణ, ప్రగతి, ప్రకృతి వ్యవసాయ విధానం తదితర అంశాలపై చర్చించారు. పొదుపు సంఘాల నిర్వహణతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేసి మంచి దిగుబడి సాధిస్తున్నామని మహిళలు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రకృతి వ్యవసాయం అధికారి ప్రకాష్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్, ఏఓ కృష్ణ చైతన్య, జిల్లా, డివిజన్ కోఆర్డినేటర్ల భానుమతి, రమేష్, డీఎల్‌ఎంపీ నరేంద్రకుమార్, ఎస్‌ఎఫ్‌ఏ కల్పన, కర్ణాటక బృందం సభ్యులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ సాగుకు ఉపయోగించే విత్తనాల గురించి వివరిస్తున్న దృశ్యం

రైలు కిందపడి యువకుడి మృతి



సోమందేపల్లి: చాకర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని యువకుడు (30) రైలుకిందపడి మృతి చెందాడు. శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. హిందూపురం రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రైలు నుంచి జారి పడ్డాడ.. లేక ఏదైనా ప్రమాదం జరిగిందా అన్న విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలూ లభించలేదు. మృతుడి ఆచూకీ లభిస్తే 94412 38283 నంబర్‌కు సమాచారం అందించాలని హిందూపురం రైల్వే పోలీసులు కోరారు.

ప్రశాంతి నిలయంలో చైనీస్ సందడి



సంగీత కచేరి నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: చైనీస్ నూతన సంవత్సర వేడుకలతో ప్రశాంతి నిలయంలో సందడి నెలకొంది. చైనీస్ సంస్కృతీ సంప్రదాయాలను పాటించే దేశాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రెండో రోజులపాటు సాగే వేడుకలు శనివారం ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో ప్రాంభమయ్యాయి. పిదప సత్యసాయి సేవాదళ్ సీనియర్ సభ్యుడు థామస్ టే సత్యసాయి ఆధ్యాత్మిక వైభవాన్ని వివరించారు. సత్యసాయి సేవాదళ్‌లో అచంచలమైన సేవలను అందించిన పలువురు సీనియర్ భక్తులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, సభ్యుడు చక్రవర్తి సన్మానించారు. సాయంత్రం ఇండోనేషియా దేశానికి చెందిన ఇంద్ర చైనీస్ భక్తిగీతాలు ఆలపించారు. సింగపూర్‌కు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు సుష్మా సోమా, విద్వాంసుడు అక్షయ్ అనంత పద్మనాభన్‌లు సంగీత కచేరి నిర్వహించారు. భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన తిప్పన్న

చిలమత్తూరు: కొడికొండ చెక్‌పోస్ట్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. శెట్టిపల్లికి చెందిన తిప్పన్న (38) హ్యూమ్ పైపుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా కొడికొండ చెక్‌పోస్టు పెట్రోల్ బంకు సమీపంలో సర్వీసు రోడ్డు నుంచి హైవేకి రాగానే కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన తిప్పన్న అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అప్పల భారంతో యువకుడు బలవన్మరణం



అజయ్‌బాబు మృతదేహం

నల్లమాడ: అప్పుల భారం భరించలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓడీ చెరువు మండలం మల్లాపల్లికి చెందిన అజయ్‌బాబు (22) వ్యవసాయం చేస్తుండేవాడు. దీనికితోడు ఇటీవల అప్పు చేసి ఐషర్ వాహనం కొనుగోలు చేశాడు. సంపాదన తక్కువగా ఉండటంతో అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక శనివారం నల్లమాడ మండలం చౌటకుంటపల్లి పొలిమేరలోని ఓ పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.రమేష్‌బాబు తెలిపారు.

విశ్వశాంతి కోసం చండీ హోమం



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

ప్రశాంతి నిలయం: విశ్వశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్ –5 భక్తులు శనివారం ప్రశాంతినిలయంలోని ఉత్తరం వైపు మైదానంలో చండీ హోమం, ఏకాదశి రుద్ర హోమం నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు నాగానంద, విదేశీయులు హోమక్రతువుల్లో పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం: ఇంజినీరింగ్ విద్యార్థి రెండు సబ్జెక్టులు ఫెయిలైనందుకు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... అశోక్ నగర్‌కు చెందిన కరణం గంగాధరరావు (20) ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మెకానికల్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సెమిస్టర్ పరీక్షల్లో రెండు సబ్జెక్టులు ఫెయిలవడంతో మనస్తాపం చెందిన గంగాధరరావు శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.